

జీవన్మరణ పోరాటం

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. 4లో▸



అధిక ధరలకు ఎరువులు

పెద్దేముల్ మండలంలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నా ఎవరికీ పట్టడంలేదని రైతులు వాపోతున్నారు. 4లో▸



ఎదుగుదల చూసి ఓర్వలేకే..

తమ్ముడి ఆర్థిక ఎదుగుదలను చూసి ఓర్వలేకే అన్న దారుణానికి పాల్పడ్డాడు. హత్యకేసును పోలీసులు ఛేదించారు. 4లో▸

న్యూస్‌రీల్

డాక్టర్ సత్యనారాయణకు ప్రశంసా పత్రం



గవర్నర్ తమిళిసై నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న సత్యనారాయణ గౌడ్

వికారాబాద్ అర్బన్: జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సత్యనారాయణ ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై నుంచి ప్రశంసా పత్రం పొందారు. అత్యధిక రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు మెమెంటో అందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి సాయి చౌదరి పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మరికల్ ఎస్సీ వసతి గృహం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ గ్రామంలోని ఎస్సీ వసతిగృహంలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలుర వసతిగృహ ప్రత్యేకాధికారి నరేందర్ రెడ్డి తెలిపారు. హాస్టల్‌లో 3 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాన్ని పొందవచ్చని అన్నారు. మరికల్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇతర జిల్లాల విద్యార్థులు సైతం ఇక్కడ ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. ఎస్టీ, బీసీ విద్యార్థులకు కూడా చేరేందుకు అర్హులని అన్నారు. మరిన్ని వివరాలకు 88860 46672 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి సదరం క్యాంపు

వికారాబాద్ అర్బన్: వికలాంగులకు సదరం క్యాంపుల ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు మీ సేవ కేంద్రాలలో ఈ నెల 15 నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16, 19, 27, 28, 30వ తేదీల్లో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో, 20, 22, 26, 27వ తేదీల్లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంపు ఉంటుందన్నారు.

చీమల్‌దరిలో దశాబ్ది వనం

- 19న మొక్కలు నాటేందుకు చర్యలు
- ఎంపీడీఓ శైలజారెడ్డి



చీమల్‌దరిలో హరితహారం కోసం చదును చేస్తున్న స్థలం

మోమిన్‌పేట: మండలంలోని చీమల్‌దరిలో దశాబ్ది వనం ఏర్పాటు చేస్తున్నామని, ఇందు కోసం నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్నామని ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 19న హరితహారం కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ఈ స్థలంలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో చీమల్‌దరిలోనే హరితహారం చేపట్టనున్నట్లు ఆమె వివరించారు. సర్పంచ్ నర్సింహారెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: శిరీషను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం కాళ్లాపూర్‌కు చేరుకొని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిరీష హత్య కేసులో నిందితుడు బావ అనిల్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో రోజుకో హత్య జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బాధిత కుటుంబానికి రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఏళ్లుగా వేళ్లానుకుంటూ.. గొడుగులా ఆదరిస్తూ..

ఊరు శివారులో ఊడల మర్రి.. వందల ఏళ్లుగా వేళ్లానుకుంటూ విస్తరిస్తోంది. చూపరులను ఆకట్టుకుంటోంది. భగభగ మండె ఎండలకు గొడుగులా ఆదరిస్తోంది. బంట్వారం శివారులో వెలిసిన ఈ ఊడల మర్రిలో బీరప్ప దేవుడు ఉన్నాడని గ్రామస్తులు ప్రతి ఐదేళ్లకోసారి జాతర నిర్వహిస్తుంటారు. బీరప్ప మర్రి చెట్టు అంటూ పిలిచే ఈ వృక్షం దాదాపు ఎకరానికి పైగా విస్తరించింది. స్థానికులే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వృక్షం చూసేందుకు వస్తుంటారు. చెట్టు నీడలో సేదతీరుతుంటారు.

– బంట్వారం

బంట్వారంలో వందల ఏళ్ల నాటి ఊడల మర్రి



వానమ్మా..రావమ్మా!



పూర్తిగా అదను కాకుండానే విత్తనాలు విత్తుకుంటున్న రైతులు..

ఆకాశంవైపు అన్నదాత చూపు
- ఊరిస్తున్న మేఘాలు.. కురవని వానలు
- సీజన్ ప్రారంభమైనా కరుణించని వరుణుడు
- విత్తు విత్తుకునేందకు రైతన్న ఎదురుచూపులు
- జిల్లాలో 5.88 లక్షల ఎకరాల సాగు అంచనా
- పత్తి, కంది, మొక్కజొన్న పంటలే అధికభాగం

వికారాబాద్ : అన్నదాత ఆకాశంవైపే చూస్తున్నాడు.. వానాకాలం సీజన్ ప్రారంభమై ఇరవై రోజులు దాటుతున్నా వరుణుడు కరుణించడంలేదు. విత్తు విత్తుకునేందుకు అంతా సిద్ధం చేసుకున్నా చినుకు కోసం ఎదురుచూపులు తప్పడంలేదు. వానాకాలం ప్రారంభమైంది మొదలు పెద్ద వర్షం ఒక్కసారి కూడా కురవకపోవటంతో ఆందోళనకు గురిచేస్తోంది. వారం రోజులుగా మేఘాలు ఊరిస్తున్నప్పటికీ చిరుజల్లులకే పరిమిత మవుతోంది. పూర్తి స్థాయిలో విత్తనాలు విత్తుకునేందుకు సరిపడా వర్షాలు కురవడంలేదు. నడి వేసవిలో అకాల వర్షాల రూపంలో వానాకాలం తలపించిన వరుణుడు వర్షాకాలం ప్రారంభమయ్యాక మొహం చాటేస్తున్నాడు. రైతులు ఏదో ఓచోట దొరికిన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఇళ్లకు తెచ్చుకున్నారు. జిల్లాలో మొత్తం 5.88 లక్షల ఎకరాల్లో ఆయా రకాల పంటలు వేయనున్నారని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. 60 మిల్లీమీటర్ల వరకు రెండు మూడు వర్షాలు కురిస్తేనే పూర్తి స్థాయిలో విత్తనం విత్తుకునేందుకు అవకాశం ఉంది. జిల్లాలో ఇంకా 30 మిల్లీమీటర్లు దాటి ఒక్క వర్షం కురవలేదని అందుకే అదను అయ్యే వరకు విత్తనాలు వేయకపోడమే మేలని అధికారులు పేర్కొంటున్నారు.

విత్తనాలు ఇంకా ఇళ్లలోనే..

సాధారణంగా వరుణుడు ముందస్తుగా కురిస్తే రోహిణీలో లేదంటే మృగశిర కార్తెలో విత్తనాలు ప్రారంభమవుతాయి. రోహిణి పూర్తయి మృగశిర కార్తె కూడా సగం పూర్తయ్యింది. అయినా విత్తనాలు విత్తుకోవటం ప్రారంభం కాలేదు. అయితే కొందరు రైతులు ధైర్యం చేసి విత్తుకుంటుండగా అవి మొలకెత్తుతాయో లేదో అనే ఆందోళన కనిపిస్తోంది. మరో వారం రోజులు ఇలాగే కొనసాగితే పెసర, మినుము, జొన్న విత్తనాలు విత్తుకోవం కష్టమని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కొందరు విత్తనాలు విత్తుకోగా ఇంకొందరు ఇళ్లలోనే పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

5.88 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో మొత్తం 5.88 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. మొత్తం 16 రకాల పంటలు సాగు చేస్తుండగా ఇందులో సింహభాగం పత్తి, కంది, మొక్కజొన్న, వరి పంటలు సాగుచేయనున్నారు. అయితే గతేడాది పత్తి క్వింటాలుకు రూ.8 వేల వరకు ధర పలకడంతో ఈ సారి పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2.5 లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది పత్తి సాగు 2.7 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని ఆశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వరి, కంది పంటలు సైతం పెరిగే అవాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే కోతులు బెడద ఎక్కువైన నేపథ్యంలో కూరగాయలు, వేరుశనగ సాగు విస్తీర్ణం మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

అదను దాటితే పెసర, మినుము వద్దు

సీజన్ ఆరంభంలోనే ఎరువులు, విత్తనాల సమస్య తలెత్తకుండా అందుబాటులో ఉంచాం. నకిలీ విత్తనాల బారిన పడకుండా దాడులు నిర్వహించాం. అంతేకాకుండా రైతులకు అవగాహన కల్పించాం. అయితే లోటు వర్షపాతం కారణంగా ఇంకా విత్తనాలు ప్రారంభం కాలేదు. వర్షాలు పూర్తి స్థాయిలో కురిసే వరకు విత్తనాలు విత్తుకోవద్దు. ఈ నెలాఖరు వరకు అన్ని రకాల విత్తనాలు విత్తుకోవచ్చు. ఈ నెల దాటితే పెసర, మినుము, జొన్న విత్తనాలు విత్తుకోకపోవడమే మేలు. మిగతా అన్ని విత్తనాలు వచ్చే నెలలో కూడా విత్తుకోవచ్చు.

– గోపాల్, డీపీఓ

మహిళల ఆరోగ్యమే ముఖ్యం



ఆరోగ్య మహిళా కర పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

- వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం
- ఎంపీ రంజిత్ రెడ్డి
- దోమలో ఆరోగ్య మహిళా ఓపీ విభాగం ప్రారంభం

దోమ: సీఎం కేసీఆర్ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళ ఓపీ విభాగాన్ని వారు ప్రారంభించారు. అనంతరం కర పత్రాలను ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ.. కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, వారి ఆరోగ్యం ముఖ్యమని అన్నారు. సీఎం కేసీఆర్ వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు, సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. గతంలో వైద్య రంగానికి ప్రతి ఏటా రూ.5 వేల కోట్లు కేటాయిస్తే ప్రస్తుతం రూ. 12 వేల కోట్లు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. నీతి ఆయోగ్ సర్వేలో రాష్ట్ర వైద్య రంగం దేశంలోనే మూడో స్థానంలో నిలవడం హర్షణీయమన్నారు. మహిళల కోసం ప్రతి మంగళవారం పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని చేపడుతారని చెప్పారు. ఇందులో ఎనిమిది రకాల చికిత్సలతో పాటు వ్యాధి నిర్ధారణ మందులను పంపిణీ చేస్తారని అన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సూచించారు. ఇప్పటికే పరిగి పట్టణంలో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశామని, అందులో డయాలసిస్ సెంటర్‌ను రోగులకు అందుబాటులో ఉంచామన్నారు. రోజుకు 20 నుంచి 25 మందికి ఉచితంగా డయాలసిస్ సేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని చేపట్టి రోగులకు అవసరమైన వైద్య పరిక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామన్నారు.

80 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో 80 శాతం ప్రసవాలు జరుగుతున్నాయని, అందులో సాధారణ ప్రసవాలే అధికమని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. వైద్య శాఖ ద్వారా గర్భిణులలో రక్తహీనతను అరికట్టడానికి, పోషకాహార స్థాయిని పెంచి మాత శిశు మరణాలను నిరోధించడానికి న్యూట్రీషియన్ కిట్లను అందిస్తున్నామన్నారు. బీపీ, షుగర్ ఉన్న బాధితులను గ్రామాలలో గుర్తించి ఉచితంగా మందులు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 134 సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. అనంతరం వైద్య శాఖలో ఉత్తమ సేవలు అందించిన వైద్య బృందానికి సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి పాల్వాన్‌కుమార్, దశాబ్ది ఉత్సవాల ప్రత్యేకాధికారి తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు వేగిరం

- జోరుగా రోడ్డు విస్తరణ పనులు
- దశల వారీగా చెట్ల తొలగింపు
- త్వరలో జాతీయ రహదారి నిర్మాణం

కొడంగల్: మహబూబ్‌గనర్- చించోలి జాతీయ రహదారి నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి.రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. రెండు దశల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. త్వరలో పనులు పూర్తి చేయించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. మొదటి దశలో నియోజకవర్గంలోని దుద్యాల మండలం దుద్యాల గేటు నుంచి పాలమూరు వరకు పనులు జోరుగా సాగుతున్నాయి. దుద్యాల నుంచి మట్టి రోడ్డును విస్తరిస్తున్నారు. కోస్గి నుంచి మహబూబ్‌నగర్ వరకు రోడ్డు విస్తరణతో పాటు చెట్లను కూడా తొలగించారు.

ఎంసీ రోడ్డుకు మోక్షం

మహబూబ్‌నగర్ – చించోలీ (ఎంసీ) అంతర్రాష్ట్ర రహదారిని కేంద్రం జాతీయ రహదారిగా మార్చింది. రహదారి నిర్మాణానికి రూ.630 కోట్లు మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ నుంచి కర్నాటక రాష్ట్రం చించోలి వరకు జాతీయ రహదారి నిర్మిస్తారు. ఈ రహదారికి 167ఎన్‌గా నామకరణం చేశారు. మహబూబ్‌నగర్, కోస్గి, కొడంగల్, తాండూరు మీదుగా చించోలి, మన్నాకెళ్లి వరకు రోడ్డు విస్తరణ జరుగుతుంది. నాలుగు లేన్ల రహదారి నిర్మిస్తారు. బెంగళూరు ముంబాయి జాతీయ రహదారులను కలిపే ఈ లింక్ హైవే 150 కిలోమీటర్ల పొడవు ఉంది. మన జిల్లాలో 45 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉంది.

కొడంగల్‌లో బైపాస్

మహబూబ్‌నగర్ – చించోలీ జాతీయ రహదారిపై కొడంగల్‌లో బైపాస్ వేస్తారు. పట్టణ శివారులో నా లుగు కిలోమీటర్ల దూరం బైపాస్ ఉంటుంది. కొడంగల్‌లో నాలుగు కిలోమీటర్ల దూరం బైపాస్ నిర్మి స్తారు. బైపాస్ రోడ్డు వెడల్పు 45 మీటర్లు ఉంది. భూ సేకరణ కోసం రూ.150 కోట్లు కేటాయించారు.



మహబూబ్‌నగర్ రోడ్డుపై నరికిన చెట్లు

ఎంసీహెచ్‌కు ఏమైంది?

- తగ్గిన ప్రసూతి కేసులు
- వైద్య సేవలపై గర్భిణులు, బాలింతల అసంతృప్తి
- ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలంటున్నారని ఆరోపణలు

తాండూరు టౌన్: పట్టణ శివారులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో రోజు రోజుకూ ప్రసూతి కేసులు తగ్గముఖం పడుతున్నాయి. ఒకప్పుడు రికార్డు స్థాయిలో డెలివరీలు చేసిన ఆస్పత్రి ప్రస్తుతం అట్టడుగుకు పడిపోవడం గమనార్హం. ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది సరైన సేవలు అందించకుండా ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లోపించిన సేవలు..

పట్టణ శివారులో నూతనంగా 150 పడకల సామర్థ్యంతో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం కేవలం ప్రసూతి, చిన్నపిల్లల కేసుల కోసమే ప్రత్యేకంగా నిర్మించారు. నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజలు సైతం ఎంసీహెచ్‌లో చేరి వైద్య సేవలు పొందుతున్నారు. పేద ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థిక సమస్యల్లో చిక్కుకోవద్దనే లక్ష్యంతో నిర్మించిన ఎంసీహెచ్‌లో వైద్యసేవలు లోపించాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తి ఉచితంగా వైద్య సేవలందించే ఈ ఆస్పత్రిలో అరకొర సేవలు ఆటంకంగా మారాయి. ఖాళీ పోస్టులను భర్తీ చేయాల్సిన ఆశాఖ ఉన్నవారితోనే నెట్టుకొస్తోంది. దీంతో సదరు వైద్యులపై పని ఒత్తిడి పడుతోంది.

ఉద్దేశపూర్వకంగా ప్రైవేటుకు..

గతంలో నిత్యం 20కి పైగా.. నెలలో 600పైగా ప్రసూతి కేసులు నమోదయ్యే ఎంసీహెచ్‌లో ఐదు నెలలుగా తగ్గముఖం పడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఆస్పత్రిలో కొద్ది నెలలుగా కేసులు తగ్గడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కయ్యారని ప్రజలు చెబుతున్నారు. డెలివరీ కోసం వస్తున్న వారిని ఉద్దేశ పూర్వకంగా ప్రైవేటు ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తూ.. కమీషన్లు తీసుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఇటీవల ఓ మాజీ ప్రజాప్రతినిధి బంధువు ప్రసూతి కోసం ఎంసీహెచ్‌కు వెళ్లగా ఆమెను పరీక్షించిన సిబ్బంది, పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడం గమనార్హం. దీంతో చేసేది లేక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా అరగంటలోపే సాధారణ ప్రసూతి కావడం గమనార్హం.



తాండూరులోని మాతాశిశు ఆస్పత్రి

సొంతంగా ప్రైవేటు ఆస్పత్రులు

గతంలో నెల రోజుల్లో 682 డెలివరీలు చేసిన రికార్డు సాధించిన ఘనత ఎంసీహెచ్ సొంతం. ప్రస్తుతం 550 కేసులకు దాటడం లేదు. అకస్మాత్తుగా కేసుల సంఖ్య తగ్గడం విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు పట్టణంలో కొత్తగా అనేక ప్రైవేటు ఆస్పత్రులు ప్రారంభమయ్యాయి. కొందరు ప్రభుత్వ వైద్యులు సైతం సొంతంగా ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తుండగా మరికొందరు వీటిలో పని చేస్తున్నారు. ఆపరేషన్ అవసరం లేకపోయినా కమీషన్ కోసం ప్రైవేటుకు వెళ్లాలని ఒత్తిడి చేస్తున్నారని గర్భిణుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కొంతమంది సీనియర్ వైద్యులు అజమాయిషీ చేస్తున్నారని. సిబ్బంది సైతం వర్గాలుగా విడిపోయి అనవసర రాజకీయం చేస్తున్నారని తెలుస్తోంది. ఆస్పత్రిలో ప్రసూతి కేసుల సంఖ్య తగ్గడంపై హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ దృష్టిసారించాలని, ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులు, చిన్నారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని ఎవరూ సూచించడం లేదు. వైద్యుల నియామకం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎంఓ

క్లుప్తంగా

సామాజిక సేవే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీవాణి

తాండూరు టౌన్: సామాజిక సేవే మా లక్ష్యమని నూలి శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ శ్రీవాణి అన్నారు. బుధవారం తాండూరులోని శివాజీ చౌక్ సమీపంలో ట్రస్టు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఎలాంటి సమస్య వచ్చినా ట్రస్టు వారికి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, శుభప్రద్ పటేల్ యువసేన సభ్యులు భాను, హరీష్, శ్రీశైలం, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

తాండూరు రూరల్: మండలంలోని వీర్‌శెట్టిపల్లి శివారులో గల కాగ్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గ్రామానికి చెందిన కొందరు తమ ట్రాక్టర్లతో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా ఇసుక తరలింపును ప్రశ్నిస్తే పర్మిషన్ ఉందని చెప్పి పాత తాండూరు మీదగా తరలిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసుల అధికారులు స్పందించి ఇసుక అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని వీర్‌శెట్టిపల్లి ప్రజలు కోరారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న పెళ్లి బస్సు



కొందుర్గు: ఆర్టీసీ బస్సును పెళ్లిబస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం పరిగి నుంచి షాద్‌నగర్ వెళుతోంది. అయితే అప్పారెడ్డిగూడ శివారు వద్ద వెళుతుండగా వెనుక వైపు నుంచి వస్తున్న పెళ్లి టూరిస్టు బస్సు ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయంపై కండక్టర్ అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణలో మనమే టాప్



ఉత్తమ వైద్య సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ఆదిబట్ల బొంగ్లూర్ సమీపంలో గల కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం విధి నిర్వహ ణలో ప్రతిభ కనబర్చిన వైద్యులను, సిబ్బందిని సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశా రు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకట రమణారెడ్డి, ఆర్డీఓ వెంకటాచారి, ఎంపీపీ కృపేష్, యాచారం జెడ్పీటీసీ జంగమ్మ, పెద్దంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి జీవన్మరణ పోరాటం

ఆరోగ్యంగా ఉన్నప్పుడే మనిషి స్థిరంగా ఉంటాడు. ఏ మాత్రం ఆరోగ్య సమస్యలు ఉన్నా ఆందోళనకు గురవుతాడు.. అలాంటిది క్యాన్సర్ మహమ్మారి కబళిస్తోందని తెలిస్తే.. ఆ బాధ వర్ణనాతీతం. ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాడు ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు.

- క్యాన్సర్ బారిన ప్రభుత్వ పాఠశాల టీచర్
- దీర్ఘకాలిక సెలవులతో అందని వేతనం
- ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు



బోధనా పద్ధతుల్లో ప్రశంసా పత్రం అందుకుంటున్న పోలినాయుడు(ఫైల్)

కుల్కచర్ల: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు తన జీవితాన్ని కాపాడుకోలేని స్థితికి చేరి ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. కుల్కచర్ల మండలం కుస్మసముద్రం ప్రాథమిక పాఠశాలలో మర్రి పోలినాయుడు ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. 33 ఏళ్లకే క్యాన్సర్ బారిన పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా కొందురు మండలం అచ్చిపోలవలస గ్రామానికి చెందిన పోలినాయుడు 2012లో ఓపెన్ కోటాలో ఉద్యోగం పొంది మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం గాలిగూడలో విధుల్లో చేరాడు. 2022 జనవరిలో కుల్కచర్ల మండలం కుస్మసముద్రం ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు. సెప్టెంబర్‌లో ఆరోగ్యం సరిగ్గా లేక పోవడంతో వైద్యపరీక్షలు చేయించుకున్నాడు.



పోలినాయుడు

క్యాన్సర్ మొదటి స్టేజ్‌లో ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కొద్దిగా కోలుకున్న అనంతరం జనవరిలో మళ్లీ విధుల్లో చేరాడు. ప్రస్తుతం క్యాన్సర్ కారణంగా ప్రాణాప్రాయ స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వైద్యం కోసం రూ. 15లక్షలకు పైగా ఖర్చు చేశాడు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేళ్ల పాప ఉంది. క్యాన్సర్ కారణంగా దీర్ఘకాల సెలవులో ఉన్నారు. దీంతో జీతం అందడం లేదు. ప్రస్తుతం కుటుంబ పోషణ, వైద్యం భారంగా మారింది. దీంతో ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. మర్రి పోలినాయుడికి అండగా నిలవాలని సహచర ఉద్యోగులు కోరుతున్నారు. ఆర్థిక సాయం చేయాలనుకున్న వారు సెల్ నంబర్ 96183 82901లో సంప్రదించాలని వారు కోరారు.

పదేళ్లలో వైద్య రంగం పటిష్టం

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: గడిచిన పదేళ్ల కాలంలో రాష్ట్రంలో వైద్య రంగాన్ని పటిష్టం చేసినట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. పల్లె, బస్తీ దవాఖానాలతో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు పోతోందన్నారు. కార్యక్రమంలో దశాబ్ది ఉత్సవాల ప్రత్యేక అధికారి కృష్ణన్, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రైతు సంక్షేమం

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



మన్నెగూడలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం సాధ్యమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మన్నెగూడలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్నదాతలకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలనే రైతుసేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, జెడ్పీటీసీ మేఘమాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సర్పంచ్ వినోద్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మైహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఎన్నో సంస్కరణలు



వైద్య సిబ్బందికి పురస్కారాలు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: వైద్యశాఖలో సీఎం కేసీఆర్ ఎన్నో సంస్కరణలు చేపట్టారని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. బడ్జెట్‌లో వైద్య రంగానికి వేల కోట్లు కేటాయించడం జరుగుతోందన్నారు. నీతి ఆయోగ్ సర్వేలో రాష్ట్ర వైద్య రంగానికి దేశంలో మూడో స్థానం లభించడం గర్వించదగ్గ విషయమన్నారు. మహిళల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ఎనిమిది రకాల వ్యాధులకు చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు ద్వారా రాష్ట్రంలో లక్షల మంది ప్రయోజనం చేకూరిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పట్టణం వరకు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు ఎర్రగడ్డపల్లిలో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్ రావు, జెడ్పీటీసీ హరిప్రియ, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు

- 50 కిలోల డీఏపీ బస్తాపై అదనంగా రూ. 200 వసూళ్లు
- ఇదేమని ప్రశ్నిస్తే దబాయిస్తున్న దుకాణాదారులు
- వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్‌కు ఫిర్యాదు



పెద్దేముల్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎరువులు

పెద్దేముల్: అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా మండలంలో ఫెర్టిలైజర్ షాపు యజమానులు పట్టించుకోవడం లేదు. ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 50కిలోల డీఏపీ బస్తాపై దాదాపు రూ. 200పైగా వసూలు చేస్తున్నారు. ఈ విషయం మండల అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న అన్నదాతలు ఆరోపిస్తున్నారు. స్టాక్ ఉన్నా రైతులకు ఇవ్వడం లేదు. ప్రతి ఏటా ఎరువుల సమస్య తప్పడం లేదని పెద్దేముల్, మారేపల్లి, జనగాం, బుద్దారం, నర్సపూర్, బుద్దారం, గాజీపూర్, రుద్రారంతో పాటు పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. బుధవారం పెద్దేముల్‌లోని పలు ఎరువుల దుకాణాల యజమానులు డీఏపీని అధిక ధరలకు విక్రయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ. 1,350 ధరకు విక్రయించాలి. కానీ ఓ దుకాణ యజమాని రూ. 1,800లకు విక్రయించాడు. దీంతో పలువురు రైతులు బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసినా మండల వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని విన్నవించారు. వెంటనే జిల్లా అధికారి మండల వ్యవసాయ శాఖ అధికారికి ఫోన్ చేసి పెద్దేముల్ ఎరువుల దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించాలని ఆదేశించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇచ్చేలా దుకాణదారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

ఫిర్యాదు చేయండి

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలి. ఎంఆర్‌పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా చర్యలు తప్పవు. ఎరువులు, విత్తనాలు కొన్న రైతులు విధిగా రసీదులు తీసుకోవాలి. దుకాణ యజమాని ఇవ్వకుంటే మండల అధికారికి ఫిర్యాదు చేయాలి. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణ లైసెన్సు రద్దు చేస్తాం.

– గోపాల్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం



మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం కొలువుదీరింది. చైర్మన్ రాథోడ్ శాంతిబాయి, వైస్ చైర్మన్ కృష్ణ, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్త కార్యవర్గం రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతు సమస్యలను పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, నాయకులు రాజు, రామునాయక్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రజాక్, యూత్ విభాగం మండల అధ్యక్షులు తాహెర్ పాల్గొన్నారు.

మహిళ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోండి

యాలాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన మహిళ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళ క్లినిక్‌ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ఎంతో బాధ్యతగా ఉందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమంతో ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, కో–ఆప్షన్ సభ్యుడు అక్బరబాబా, పీహెచ్‌సీ వైద్యురాలు అనూష, బీఆర్ఎస్ నాయకులు ఆశన్న, సాయిలు ముదిరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణ, సాయిలు, రవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని మహిళ హత్య



సోమని యాదమ్మ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: మతిస్థిమితంలేని మహిళ దారుణహత్యకు గురైంది. ఈ సంఘటన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని భూదాన్ పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో వెలుగుచూసింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, చిన్నరావిరాల గ్రామానికి చెందిన సోమని యాదమ్మ(55) ఐదేళ్లుగా మతిస్థిమితం సరిగా లేక సమీపంలో ఉన్న గ్రామంలో తిరుగుతూ ఉంటుంది. కాగా, గత 15 రోజులుగా పిలాయిపల్లి గ్రామంలో తిరుగుతూ అడుక్కొని తింటూండేది. కాగా మంగళవారం రాత్రి గ్రామసమీపంలో ఉన్న దుర్గ వైన్స్ ఎదురుగా ఉన్న ఓ భవనం వెనుకాల సెల్లార్‌లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె తలపై మోదీ హత్య చేశారు. దాంతో తీవ్ర రక్తస్రావమై అక్కడక్కమే మృతి చెందింది. అయితే బుధవారం మధ్యాహ్నం వైన్స్‌షాపులో మద్యం కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి మూత్ర విసర్జన కోసం అటుగా వెళ్లగా వివస్త్ర స్థితిలో పడిఉన్న ఓ మహిళా మృతదేహం కనిపించింది. వెంటనే సర్పంచ్ అందెల హరీష్‌కు తెలపడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్ గ్రామశివారులో రోడ్డు ప్రక్కన ఉన్న బావివద్దకు వచ్చి ఆగిపోయింది. తల పగిలి ఉండటంతో దేనితో హత్య చేశారని తెలియరాలేదు. సంఘటనా స్థలంలో కూడా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. చివరకు వైన్స్ షాప్ ఏర్పాటు చేసిన కెమెరాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించినా, అందులో ఎలాంటి అనవాళ్లు రికార్డు కాలేదు. ఎవరో మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే స్థానిక ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడిని అనుమానించి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. అయితే మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త లింగయ్య మాత్రం గతంలో అనారోగ్యంతో మృతి చెందాడు.

దుద్యాలలో రైతు సేవా కేంద్రం ప్రారంభం

బొంరాస్‌పేట: దుద్యాల మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అన్ని రకాల సేవలు ఒకే చోట లభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. వీటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేయనున్నట్లు తెలిపారు.

తమ్ముడి ఎదుగుదల చూసి ఓర్వలేకే..

- ఈ నెల 12న తమ్ముడిని నరికి చంపిన అన్న
- హత్య కేసు వివరాలు వెల్లడించిన సీఐ



కేసు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ అరవింద్‌కుమార్

యాలాల: తమ్ముడి ఆర్థిక ఎదుగుదలను చూసి ఓర్వలేక ఓ అన్న దారుణానికి ఒడిగట్టాడు. ఈ నెల 12న మండలంలోని నాగసముందర్ గ్రామంలో జరిగిన హత్య కేసు వివరాలను తాండూరు రూరల్ సీఐ రాంబాబు, యాలాల ఎస్ఐ అరవింద్‌కుమార్‌తో కలిసి వెల్లడించారు. నాగసముందర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య, అంజమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కృష్ణ, వెంకటేష్, రవికుమార్(32). రవి గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. తండ్రి లక్ష్మయ్యకు వారసత్వంగా ఐదెకరాలు వ్యవసాయ భూమి వచ్చింది. హతుడు రవి సొంతంగా ఐదెకరాలను కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో వెంకటేష్ ఆస్తి పంపకం చేయాలని తండ్రిని కోరాడు. తాను బతికున్నంత వరకు ఆస్తి పంచనని తండ్రి తేల్చి చెప్పాడు. తమ్ముడు రవికుమార్ కారణంగానే తండ్రి ఆస్తి పంచడం లేదని వెంకటేష్ భావించాడు. హత్య జరగడానికి ఒక రోజు ముందు ఆస్తి పంకంపై పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగింది. అయితే రవి హాజరుకాలేదు. దీంతో రవిపై వెంకటేష్ కోపం మరింత పెరిగింది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన వెంకటేష్ రవిపై గొడ్డలితో నరికి చంపాడు. బుధవారం ఇందిరమ్మ కాలనీలో నిందితుడు వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలి, బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు



నాపరాయిని అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేస్తున్న మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు

- కలెక్టర్ ఆదేశాలతో ఇసుక, నాపరాతి అక్రమ రవాణాపై దాడులు
- జీవన్గీ గనుల్లో తవ్వకాలు బంద్, లారీ సీజ్

బషీరాబాద్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. మే 30న సాక్షి దినపత్రికలో 'నాపరాతి గనుల్లో యథేచ్ఛగా తవ్వకాలు' శీర్షికన వచ్చిన కథనంపై విచారణ జరపాలని ఆదేశించారు. దీంతో బుధవారం తాండూరు మైన్స్ ఏడీ సాంబశివరావు, తహసీల్దార్ వెంకటస్వామి, రాయల్టీ అధికారులు, బషీరాబాద్ ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ జీవన్గీ గనుల్లో దాడులు చేశారు. అధికారుల సమాచారం ముందే పసిగట్టిన గని యజమానులు అక్కడి నుంచి పారిపోయారు. అనుమతి లేకుండా నాపరాయిని తరలిస్తున్న లారీని అధికారులు సీజ్ చేసి బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జీవన్గీ గనుల్లో అనుమతులు లేకుండా మైనింగ్ జరుగుతున్నట్లు గుర్తించినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు.

ఎయిర్‌పోర్టు మెట్రో ప్రీబిడ్ విజయవంతం

- హాజరైన 13 గ్లోబల్ కంపెనీలు
- ప్రాజెక్టు వివరాలను వెల్లడించిన ఎన్వీఎస్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రాయదుర్గం నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నిర్మించనున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుపై మరో అడుగు ముందుకు పడింది. సుమారు రూ.6250 కోట్ల అంచనాలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) ప్రాతిపదికన గ్లోబల్ టెండర్‌లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బేగంపేట్‌లోని హెచ్ఎంఆర్ కార్యాలయంలో ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్అండ్‌టీ, ఆల్‌స్టామ్, సీమెన్స్, టాటా ప్రాజెక్ట్స్, ఐఆర్‌సిటీఎన్, ఆర్‌వీఎన్ఎల్, బీఈఎంఎల్, పీఎన్‌డీఆర్‌టీఎల్ రహీ టెక్నాలజీస్ తదితర జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన 13 కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ప్రాజెక్టు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఈ ప్రాజెక్టు ప్రత్యేకతలను, ఇప్పటి వరకు చేపట్టిన పనులను గురించి వివరించారు. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 31 కిలోమీటర్‌ల దూరం నిర్మించనున్న ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు సర్వే, పెగ్‌మార్కింగ్, అలైన్‌మెంట్ తదితర పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. భూసార పరీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఈ మార్గంలో 29.3 కిలోమీటర్‌ల ఎలివేటెడ్ కారిడార్ కాగా, 1.7 కిలోమీటర్‌ల వరకు అండర్‌గ్రౌండ్ మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టవలసి ఉంటుంది.ఎయిర్‌పోర్టు టర్మినల్ సమీపంలో ఒక అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 9 మెట్రో స్టేషన్‌లు రానున్నాయి. ఈ సందర్భంగా రోలింగ్‌స్టాక్ (రైళ్లు), మౌలిక సదుపాయాలు, సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రైన్ కంట్రోల్ సిస్టమ్, సాంకేతిక ప్రత్యేకతలు తదితర అంశాలపైన వివరంగా చర్చించారు. ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు వ్యక్తం చేసిన సందేహాలను ఎండీ నివృత్తి చేశారు. ఈ ప్రాజెక్టు వ్యయంలో హెచ్ఎండీఏ, జీఎమ్మార్ ఎయిర్‌పోర్టు 10 శాతం చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం టెండర్లను దాఖలు చేసేందుకు జూలై 5వ తేదీ వరకు గడువు విధించిన సంగతి తెలిసిందే. టెండర్‌లను దక్కించుకున్న నిర్మాణ సంస్థ సెప్టెంబర్ నుంచి పనులను ప్రారంభించి వచ్చే 3 ఏళ్లలో పూర్తి చేయవలసి ఉంటుందని ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ల పర్యవేక్షణలో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్ సలహాదారు సుభోద్ జైన్, సీఈఈ డీవీఎస్ రాజు, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నందిగామ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ న సంఘటన మండల కేంద్రమైన నందిగామ అనుభంద గ్రామం చంద్రాయన్‌గూడ శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం వివరాలు.. చంద్రాయన్ గూడ శివారులోని శాంబవి వెంచర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెంది ఉన్నాడని వెంచర్ సూపర్ వైజర్ ఇచ్చిన సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు.. మృతుడికి కేవలం డ్రాయర్ మాత్రమే ఉందని, వడదెబ్బకు రెండు రోజుల ముందే మృతి చెంది ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. వెంచర్ సూపర్ వైజర్ సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు. మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.